క్లుప్తంగా

పేద కుటుంబానికి చేయూత



పెండ్లి సరుకులు అందించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

శింగనమల: శింగనమలలోని శ్రీనివాసులు, రామాంజినమ్మకు ఐదుగురు సంతానం. వారి కూతురు పూజిత వివాహం నిశ్చయించారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి జొన్నలగడ్డ నిర్మలా దేవి, ఆలూరు శ్వేత మంగళవారం పెళ్లి సరుకులు, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.నాగమునెమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు శకుంతలమ్మ, చెన్నమ్మ, నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

శింగనమల: మండలంలో రబీ కింద పంటలను సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని ఏఓ చిన్నమ్మ తెలిపారు. రైతులు ఆర్బీకేల వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



రుబియా ఖానమ్‌కు నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక గౌతమ్ మోడల్ స్కూలులో మంగళవారం ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థి రుబియా ఖానమ్‌కు ఎకో సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్, పాఠశాల కరస్పాండెంట్ మధుసూదనరెడ్డి రూ.10,100 నగదు అందజేశారు. విద్యార్థిని ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకుని ఎకో సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్ గౌతమ్ మోడల్ స్కూలులో మిమిక్రీ, మ్యాజిక్ షో, వెంట్రిలాక్విజమ్ చేశారు. ప్రదర్శన ద్వారా వచ్చిన రూ.10,100ను విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ కంటి వెలుగు' పేదలకు వరం

యాడికి: వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదలకు వరమని తాడిపత్రి డివిజన్ నేత్ర వైద్యాధికారి మధుసూదన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నగరూరులో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 27న అనంతపురంలో కంటి ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ తెలిపారు.

గుత్తిలో బేల్దారి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న మధు

గుత్తి: పట్టణంలోని చెర్లోపల్లిలో ఓ బేల్దారి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన మధు (32)కు ఎనిమిదేళ్ల క్రితం యాడికికి చెందిన భవానితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. బేల్దారి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్యం పాలయ్యాడు. దీంతో జీవితం పై విరక్తి చెంది ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య భవాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సినీ నటి హిమజ సందడి



గుంతకల్లులో హిమజ

గుంతకల్లు: బిగ్‌బాస్ ఫేమ్, సినీ నటి హిమజ మంగళవారం పట్టణంలో సందడి చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ సెలూన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఆమెను చూసేందుకు ఆసక్తి చూపారు.

300 చెట్లు అగ్నికి ఆహుతి

గార్లదిన్నె: జిల్లా కేంద్రానికి చెందిన రైతు కృష్ణా నాయక్ సాగు చేసిన చీనీ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన మేరకు... కొప్పలకొండ పొలంలో 700 చీనీ చెట్లను సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు పక్క పొలంలోని గలుగుకు నిప్పు పెట్టడంతో మంటలు తోటకు వ్యాపించి 300 చీనీ చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. రైతు గుర్తించి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాడు. దాదాపు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



దిమ్మగుడిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆయన బాటలో తాను పని చేస్తున్నట్లు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పాదయాత్ర 10వ మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పి.వీరన్నపల్లి నుంచి యాత్ర ప్రారంభం కాగా దారి పొడవునా ప్రజలు పూల వర్షం కురిపిస్తూ హారతి ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రతి గడపకు తిరిగానన్నారు. ప్రభుత్వం అందించే నవరత్నాలు పథకాలు ప్రజలకు ఎలాంటి భేదాభిప్రాయం లేకుండా పార్టీలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. యాత్ర పి.కొట్టాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆప్యాయంగా అవ్వా నీకు పింఛన్ వస్తోందా.. సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా ... అడిగి తెలుసుకోవడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం యాత్ర దిమ్మగుడి గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, కందుగోపుల మురళీ, జెడ్పీటీసీ బాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, కార్యదర్శి లక్కు రామచంద్రారెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ కొట్టాలపల్లి హరినాథరెడ్డి, పాశం రంగస్వామియాదవ్, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధర్‌రెడ్డి, చిట్టూరు భాస్కర్‌రెడ్డి, రాము, శేషారెడ్డి, వెంకటస్వామిగౌడ్, బొప్పెళ్ల రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మోపిరెడ్డి, బలరామిరెడ్డి, రాజాబాబు, నాగేశ్వర, పెద్దలక్ష్మన్న, నాగభూషణ, ఆంజినేయులు, రామచంద్ర, కృష్ణా, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, రామాంజినేయులు, రమేష్, క్రిష్ణ, ఆదినారాయణ, మదు, రాఘవేంద్ర, అమర్‌నాథరెడ్డి, కొండూరు దేవమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దవడుగూరులో బహిరంగ సభ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో బుధవారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు. మండలంలో 10 రోజులుగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమయాత్ర బుధవారం సాయంత్రం ముగుస్తుందన్నారు. ఈసందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రంగనాథుడి వసంతోత్సవం



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత రంగనాథ స్వామి

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం స్వామికి హంస వాహనం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మంత్రోచ్చారణల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత స్వామి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ చేసి పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకుని టెంకాయలు కొట్టేందుకు మహిళలు బారులుదీరారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆలయ ఆవరణలో రంగనాథ స్వామికి ఊయల సేవ చేశారు. అనంతరం సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను జక్కలచెరువు గ్రామానికి తీసుకెళ్లగా అక్కడ భక్తులు స్వాగతం పలికారు. స్వామి ఉత్సవ విగ్రహాలు జక్కలచెరువు గ్రామానికి తరలివెళ్లడంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

30 ఏళ్ల సమస్యకు 3 రోజుల్లో పరిష్కారం



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

- అంబేడ్కర్ కాలనీకి సీసీరోడ్డు నిర్మాణం
- సొంత డబ్బు వెచ్చించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- కాలనీవాసుల హర్షం

తాడిపత్రి: పట్టణంలోని నడిబొడ్డు ప్రాంతంలో ఉన్నా 30 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోక హరిజన వాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను 3 రోజుల క్రితం ఎమ్మెల్యే కేతిరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించిన ఆయన సీసీ రోడ్డు నిర్మించి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే..పట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ కాలనీకి వెళ్లేందుకు కనీసం సరైన మట్టిరోడ్డు లేదు. దాదాపు 30 ఏళ్లుగా కాలనీవాసులు అష్టకష్టాలు పడుతున్నారు. గతంలో జేసీ సోదరులను సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు కాలనీవాసులు అడిగితే వారు 'ఆ స్థలం ఏమన్నా మీ యబ్బ సొత్తా' అంటూ తమ అవమానపరిచి పంపినట్లు కాలనీవాసులు గుర్తు చేస్తుకుంటున్నారు. ఈక్రమంలో వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సైతం అడిగేందుకు ముందుకు రాలేదు. అయితే ఇటీవల ఎలాంటి సమస్యనైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో కాలనీవాసులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. తక్షణం స్పందించిన ఆయన కాలనీకి వెళ్లే రోడ్డును స్వయంగా పరిశీలించారు. తర్వాత సోమవారం రాత్రి దాదాపు 63 మీటర్ల దూరం సీసీరోడ్డు నిర్మించారు. ఇందుకు దాదాపు రూ.3.5 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే భరించడంతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణం హర్షణీయం



కొన్నేళ్లుగా పట్టణ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నాను. కానీ కాలనీ నుంచి సీబీరోడ్డు మధ్య మట్టి రోడ్డు ఉన్నందున చాలా ఇబ్బందులు పడ్డాం. చిన్నపాటి వర్షం వచ్చినా నడవలేక నానా యాతనపడ్డాం. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాలనీ ప్రజల ఇబ్బందులను తెలుసుకుని సీసీరోడ్డు నిర్మించడం హర్షణీయం. ఆయన మేలును మరువలేం.

– రామాంజనేయులు, అంబేడ్కర్‌నగర్, తాడిపత్రి

ఆధార్ సేవలందించండి



సలకంచెరువులో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి

శింగనమల: గ్రామ సచివాలయాల్లో ప్రజలందరికీ ఆధార్ సేవలందించాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి అన్నారు. మండలంలోని సలకంచెరువు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆధార్ సేవలపై ప్రజలకు సమాచారం అందించాలని, ఈసేవలు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సేవలపై పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలతో మాట్లాడారు. డిజిటల్ అసిస్టెంట్‌తో వివరాలు అడిగితెలుసుకున్నారు.

యల్లనూరు: యల్లనూరు, వెన్నపూసపల్లి కేంద్రాల్లో ఆధార్‌కార్డు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యల్లనూరులో 40, వెన్నపూసపల్లిలో 12మందికి ఆధార్‌కార్డులను నమోదు చేసినట్లు చెప్పారు.

దుర్గ గుడి చైర్మన్ పదవి కేటాయింపు హర్షణీయం

గుంతకల్లుటౌన్: సగర కులానికి చెందిన కర్ణాటి రాంబాబుకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించడం హర్షణీయమని సగర సంఘం రాష్ట్ర నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ భీమలింగప్ప, సగర యువసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారప్ప పేర్కొన్నారు. సగర కులస్తులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి వారు మంగళవారం కృతజ్ఞతలు తెలియజేశారు. నేతలు రమేష్, శ్రీనివాసులు, నాగరాజు, గంగన్న పాల్గొన్నారు.

అనుమానితుల విచారణ

పుట్లూరు: ఓ బాలుడికి మత్తు మందు ఇచ్చినట్లు ఆరోపణలపై మంగళవారం ముగ్గురు అనుమానితులను మంగళవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వివరాలు.. మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన రమణ కుమారుడు స్థానిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. జాతకం చెబుతామని వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతడిని శ్మశానంలోకి తీసుకెళ్లగా కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే బాలుడు తనకు ఇంజెక్షన్ ఇచ్చారని చెప్పడంతో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఇంజెక్షన్ చేయలేదని నిర్ధారించుకున్నారు. అనంతరం అనుమానితులను పోలీసులు పూచీకత్తుపై పంపించారు.

'దళితులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయొద్దు'



మాట్లాడుతున్న గంపక్క, నారాయణ

పెద్దవడుగూరు : దళితులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయొద్దని పి.వీరన్నపల్లి గ్రామానికి గంపక్క, నారాయణ పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు స్వచ్ఛందంగా వెళ్లామని, ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తమను బెదిరించలేదన్నారు. తమను అడ్డం పెట్టుకుని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. ఏదైనా రాజకీయం చేయాలనుకుంటే మీరే తేల్చుకోవాలని అందులోకి తమను లాగొద్దని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

పామిడి: ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు నీటి ఎద్దడి నివాణకు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టౌన్ సచివాలయ కన్వీనర్ బీ ఆసిఫ్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓ సుధాకర్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక నాగిరెడ్డి కాలనీలో విద్యుత్ బోర్ మోటార్‌తో కూడిన రెండు కొత్త స్పాట్ డెలివరీ ట్యాంకులను ప్రారంభించారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

యల్లనూరు: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని వైద్యుడు లోకేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొగా వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కిల్కారి సేవలు, యాప్ గురించి తెలియజేశారు. ఆశాకార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. డాక్టర్ శివసాయి, సీహెచ్‌వో మధుకుమార్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పన్ను వసూలుపై దృష్టి సారించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆస్తి, నీటి పన్నుల వసూలుపై వార్డు అడ్మిన్లు, కార్యదర్శులు దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్ సూచించారు. మంగళవారం పట్టణంలోని 7, 27 వార్డు సచివాలయాలను పరిశీలించిన వారు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వార్డుల్లో వసూలైన పన్నుల గురించి ఆరాతీశారు. పెండింగ్ బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులను నెలాఖరులోగా వసూలు చేయాలని చెప్పారు. మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, ఆర్‌ఐ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడి మౌన దీక్ష

గుంతకల్లు: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నిరసిస్తూ డీఆర్‌ఎం చాంబర్ ఎదుట దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ మంగళవారం మౌన దీక్ష చేపట్టాడు. సమస్యలను ప్లకార్డుపై రాసుకుని ప్రదర్శిస్తూ డీఆర్‌ఎం చాంబర్ ఎదుట నిలబడ్డాడు. విషయం తెలుసుకున్న డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి వెంటనే స్పందించారు. విజయ్‌కుమార్‌ను తన చాంబర్‌లోకి ఆహ్వానించి, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. దీంతో నిరసనను విరమించుకున్న విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. సీఅండ్‌డబ్ల్యూ, ఎలక్ట్రికల్ విభాగంలోని వందలాది మంది ఉద్యోగులకు గత ఏడాది డిసెంబర్ 31కు ముందే ప్రమోషన్లు కల్పించాల్సి ఉందన్నారు. 2022, మార్చికి కమర్షియల్ విభాగంలో ఇవ్వాల్సిన పిరియాడికల్ బదిలీ ఉత్తర్వులు నేటికి జారీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమస్య పరిష్కారించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన డీఆర్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పప్పుశనగ పంట దగ్ధం


పుట్లూరు: నూర్పిడి యంత్రంలో వేసి గింజలను వేరు చేయడానికి కల్లంలో ఉంచిన పప్పుశనగ పంటకు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించిన సంఘటన మండలంలోని మడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంకాల్‌రెడ్డి రబీలో సాగు చేసిన పప్పుశనగను గ్రామ సమీపంలోని కల్లంలో నిల్వ ఉంచాడు. మంగళవారం మధ్యాహ్నం పంటకు మంటలు వ్యాపించడంతో గ్రామంలోని తోటి రైతులు మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. కాగా ఈ ప్రమాదం వల్ల రైతుకు రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

యాడికి: బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. రాయలచెరువు గ్రామానికి చెందిన బిందుసాగర్ నాయుడు మంగళవారం యాడికిలో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. డిగ్రీ కళాశాల వద్ద రాయలచెరువు నుంచి వస్తున్న బొలెరో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో బిందుసాగర్ నాయుడికి కాలికి తీవ్రగాయాలు కావడంతో యాడికిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు.

పుస్తకాలతో దోస్తీ

- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు



తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టడీ క్లాసుల్లో విద్యార్థులను చదవిస్తున్న అధ్యాపకులు

తాడిపత్రి టౌన్ : ఇంటర్ పరీక్షలు వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు దగ్గర పడటంతో విద్యార్థులు పుస్తకాలతో దోస్తీ చేస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు గతేడాది డిసెంబర్ 20 నుంచి ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటల నుంచి 9-45 గంటలకు సాయంత్రం 4 నుంచి 4:30 వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించడంతోపాటు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థి పట్ల అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులకు ఆ సబ్జెక్టుపై అదనపు తరగతులతోపాటు చదవడం, రాయడంపై దృష్టి కేంద్రీకరించారు. ప్రయివేటు కళాశాలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

జూనియర్ కళాశాలు ఇవే...

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూలుతోపాటు 7 ప్రయివేటు జూనియర్ కళాశాలున్నాయి. ఆలాగే పెద్దపప్పూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, యాడికిలో ఒక ప్రయివేటు జూనియర్ కళాశాల ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో 495 మంది విద్యార్థులు పరీక్షలు రాసున్నారు. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 324 మంది, పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 80 మంది, తాడిపత్రి మోడల్ స్కూలులో 91 మంది విద్యార్థులు పరీక్ష రానున్నారు. రెండేళ్లుగా కరోనా నేపథ్యంలో తరగతులు సక్రమంగా జరగకపోవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గింది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత శాతం లక్ష్యంగా చర్యలు చేపట్టుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక క్లాసులతోపాటు రోజు చదివించడం, వాటిపై పరీక్షలను నిర్వహించి, ఏ సబ్జెక్ట్ లో వెనుక బడిన విద్యార్థులను ప్రత్యేకంగా చదివిస్తున్నారు. ఆలాగే ఒక్కొక్క అధ్యాపకుడికి కొంత మంది విద్యార్థులను కేటాయించి చదివిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం జూనియర్ ఇంటర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష పత్రాల మాదిరిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు

ప్రత్యేక తరగతుల నిర్వహణ



రోజూ ఉదయం, సాయంత్రం అధ్యాపకులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. చదవించడం, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వెనుకబడిన విద్యార్థులకు ఇంకా ప్రయోజనకరం.

– బాలు, విద్యార్థి, సీఈసీ, సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల తాడిపత్రి

గ్రూపులుగా చదివిస్తున్నారు



విద్యార్థులను గ్రూపులుగా విభజించి అధ్యాపకులు చదివిస్తున్నారు. పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలా ద్వారా వెనుకబడిని విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విధానం చాలా బాగుంది. పరీక్షల్లో మంచి మార్కులు తేవటానికి ప్రయత్నిస్తాను.

– మైత్రి, బైపీసీ సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాడిపత్రి

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మావంతు కృషి చేస్తున్నాం. రోజూ పబ్లిక్ తరహాలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన తరువాత పరీక్షలు పెడుతున్నాం. పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా గ్రేడ్‌లుగా విభజించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– విజయకుమార్, ప్రిన్సిపాల్ , తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల

తొండపాడు హుండీ ఆదాయం రూ.7.81 లక్షలు

గుత్తి రూరల్: తొండపాడులో వెలసిన ప్రసిద్ధ బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.7,81,089 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఉత్సవ ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది జనవరి 25 నుంచి ఫిబ్రవరి 6 వరకూ హుండీల ద్వారా రూ.7.81 లక్షలు ఆదాయం లభించింది. సొమ్మును దేవదాయశాఖ ఖాతాకు జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

వలంటీర్ బలవన్మరణం



హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరులో వలంటీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి(24) తల్లిదండ్రులు మృతి చెందడంతో ఒంటరిగా ఉంటూ వలంటీర్‌గా విధులు నిర్వర్తించేవాడు. ఈ క్రమంలో ఒంటరితనం భరించలేక ఇంటి పైకప్పుకు ఉరివేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.